## క్లుప్తంగా

### పేద బ్రాహ్మణుడికి ఆర్థిక సాయం



శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న గుండ్రాజు శివశంకర్‌రాజు

**తిరుపతి మంగళం:** మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లో నివాసముంటున్న పేద బ్రాహ్మణుడు శ్రీనివాసరావుకు ఆ పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వైద్యులు ఆయనకు కాలు తొలగించడంతో కుటుంబ పోషణ కష్టమై అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శివశంకర్‌రాజు సోమవారం వారి ఇంటికి వెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. రుద్రపాల్, వార్డు సభ్యులు మణి, చెంగల్రాయులు పాల్గొన్నారు.

### కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరం

**తిరుపతి సిటీ:** విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమని సౌదీ అరేబియా మజ్‌మహ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు జాబీనా సుల్తానా తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం వర్చువల్ విధానంలో ఇంటర్నేషనల్ వెబినార్‌ను నిర్వహించారు. ఇందులో జాబీనా సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొని కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్ ప్రాముఖ్యతను వివరించారు.

### పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** తిరుపతి లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రతినిధులు సంయుక్తంగా సోమవారం మెటర్నటీ ఆసుపత్రి వద్ద సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.మునికృష్ణమనాయుడు, లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ అధ్యక్షుడు సోమయ్య, ముబాకర్ బాషా, రాజేంద్రప్రసాద్, మేరీ, పద్మనాభన్, వికాస్, సురేంద్రబాబు, సురేష్, శ్రీహరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అమ్మవారి సేవలో గాయకుడు మనో



**తిరుచానూరు(చంద్రగిరి):** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీ గాయకుడు మనో సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### నేడు పుత్తూరులో విద్యుత్ అదాలత్

**పుత్తూరు:** పట్టణంలోని విద్యుత్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.చిన్నరెడ్డప్ప తెలిపారు. పుత్తూరు డివిజన్ పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం, నగరి, విజయపురం, నింద్ర, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విద్యుత్ అదాలత్‌లో రాతపూర్వకంగా తెలియజేయవచ్చని తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**కార్వేటినగరం:** చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలోని పద్మ సరస్సు సమీపంలో సోమవారం టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కార్వేటినగరం కోటదళితవాడకు చెందిన శేఖర్(32) సొంత పనుల నిమిత్తం పద్మ సరస్సుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఈ క్రమంలో పుత్తూరు నుంచి వెళుతున్న టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దస్తగిరి తెలిపారు.

# శాస్త్రోక్తంగా మూలస్థానమ్మ దీప స్తంభ ప్రతిష్టాపన

- కార్యక్రమంలో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



ధ్వజ స్తంభ కలశాభిషేకానికి ఆలయ అధికారులతో కలిసి వెళ్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు

**చంద్రగిరి:** గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ బాలాలయంలో అమ్మవారి యూప(దీప) స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్ సీపీ యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా అమ్మవారి మూలమూర్తి సమక్షంలో గణపతి పూజ, గణపతి హోమం, నవగ్రహం హోమం, కలశప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలశాలలోని పవిత్రజలాన్ని ఊరేగింపుగా దీప స్తంభం వద్దకు తీసుకెళ్లారు. తదుపరి వేద మంత్రోచ్చారణల నడుమ దీపస్తంభానికి అభిషేకం చేసి, జ్యోతిని వెలిగించారు. అనంతరం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల ఏళ్ల నాటి అతిపురాతనమైన శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ, తుడా, భక్తులు పెద్ద ఎత్తున నగదు అందించినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి దీప స్తంభం కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాల నుంచి వేద పండితులను పిలిపించి శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆయన అన్నారు. సంక్రాంతి ఉత్సవాలను కూడా వేడుకగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, చేగు గోవర్ధన్ గుప్తా, బండారు హేమ చంద్రారెడ్డి, కోలా మల్లి, యారాశి మదన్‌మోహన్ రెడ్డి, బోర్డు సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం



సుబ్రమణ్యస్వామి కళ్యాణోత్సవం, చిత్రంలో ఆలయ కమిటీ చైర్మన్

**పాకాల:** ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి నిత్య పూజలతోపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం నిర్వహించిన సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారని వివరించారు. కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ యువరాణి, కమిటీ సభ్యులు రేవతి, బాబురెడ్డి, మాధవి, మమత, లోకనాథం, యోగానందచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన



పతకాలతో విద్యార్థులు

**తిరుపతి:** రూరల్ మండలం తుమ్మలగుంటలోని అంబేడ్కర్ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో సత్తా చాటిన కేశవ రెడ్డి స్కూల్, జయానగర్ బ్రాంచ్ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ముజీబ్, ఉపాధ్యాయులు అభినందించారు. సోమవారం ఈ మేరకు ప్రిన్సిపల్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు సంబంధించి 16, 18, 20, 25 కిలోల విభాగాల్లో కేశవరెడ్డి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. మొత్తం 4 బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 9 కాంస్య పతకాలు సాధించి ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు వివరించారు.

# వైద్యరంగంలో ఫార్మసిస్టుల సేవలు కీలకం



శిక్షణలో సెవెన్‌హిల్స్ కళాశాల సిబ్బంది

**రామచంద్రాపురం:** వైద్యరంగంలో ఫార్మసిస్టుల సేవలు కీలకమని బెంగళూరు కృపానిధి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అకడమిక్ డైరెక్టర్ ఎండీ కర్వేకర్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో డిజైన్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డిజైన్ ఇన్ అనలిటికల్ కెమిస్ట్రీ అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోయంబత్తూరు కేఎంసీహెచ్ కాలేజీ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖరన్, సెవెన్‌హిల్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సతీష్‌కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోండి



ఓటరు నమోదుపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

**తిరుపతి సిటీ:** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం సాయంత్రం తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. ఓటుతో తమకు నచ్చిన పాలకులను ఎన్నుకోవచ్చని చెప్పారు. మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్నారు. అందులో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటరుగా ఇంకా నమోదు కాని విద్యార్థినుల కోసం పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం సంబంధిత ఫారాలు, అధికారులను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో వీసీ భారతి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన



టీవీలో వీక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

**పాకాల:** ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సోమవారం టీవీ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పథకం ద్వారా ఉచితంగా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. పాత ఆరోగ్యశ్రీ కార్డు స్థానంలో కొత్తగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులను వచ్చే నెల 1వ తేదీ నుంచి అందజేస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు 104 కాల్ సెంటర్, విలేజ్ హెల్త్ క్లినిక్, 108 అంబులెన్స్, ఫ్యామిలీ డాక్టర్, పీహెచ్‌సీ, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా సంబంధిత ఆస్పత్రిలో చేరి ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, డాక్టర్ కుసుమ, ఈఓపీఆర్డీ మాలతి, ఏపీఎం కోమలాదేవి, ఏపీఓ కళ్యాణి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



**శ్రీకాళహస్తి:** పట్టణంలోని ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున వరదరాజస్వామి ఆలయానికి భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తుల తాకిడికి తగినట్లు పటిష్టమైన క్యూలు ఏర్పాటు చేయాలన్నారు.

# రుయాలో పీపుల్స్ చారిటీ సామాజిక సేవ



రుయాలో నిరుపయోగంగా వున్న వస్తువులను పరిశీలిస్తున్న పీపుల్స్ చారిటీ ప్రతినిధులు

**తిరుపతి తుడా:** తిరుపతి పీపుల్స్ చారిటీ ప్రతినిధులు రుయా ఆసుపత్రిలో సామాజిక సేవ చేపట్టారు. ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న మంచాలు, వీల్ చైర్లు, స్ట్రక్చర్లు తదితరాలకు ఉచితంగా మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. వారు సోమవారం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభును సంప్రదించి నిరుపయోగంగా ఉన్న ఖరీదైన పరికరాలకు మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు. మొదటిలో 14 ఐసీయూ మంచాలు, 10 స్ట్రక్చర్లు, 10 వీల్ చైర్లు, దాదాపు 40ఐవీ స్టాండ్లను బాగు చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రుయా ఎంఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కేఆర్ ప్రకాష్, లక్ష్మీనారాయణ, పీఆర్వో కిరణ్ పాల్గొన్నారు.

# కళల వికాసంతోనే సంస్కృతి పరిరక్షణ





మాట్లాడుతున్న మబ్బు సూర్యనారాయణరెడ్డి, మాయా బజార్ నాటకంలోని సన్నివేశం

**తిరుపతి కల్చరల్:** భారతీయ సంప్రదాయానికి అద్దం పట్టే కళలు వికాసం చెందినప్పుడే మన సంస్కృతి పరిరక్షణ సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షిక కళోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నాటక, నృత్య, భగవద్గీత పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ టీటీడీ డెప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, టీటీడీ హెల్త్ ఆఫీసర్ భీష్మనాయుడు, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఆలిండియా రేడియో రిటైర్డ్ డైరెక్టర్ మల్లేశ్వరరావు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, బ్లిస్ హోటల్స్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి, ఊకా విజయకుమార్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 60 ఏళ్లుగా నాటక కళను, కళాకారులను ప్రోత్సహిస్తూ కళల వికాసం కోసం కృషి చేస్తున్న కోనేటి సుబ్బరాజు అభినందనీయుడని కొనియాడారు. అంతకుముందు కళాకారులు 64 కళల వేషధారణలతో మహతి కళాక్షేత్రం నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, రామకృష్ణ డీలక్స్ మీదుగా మహతి కళాక్షేత్రం వరకు కళా ప్రదర్శన చేపట్టారు.

## అరుణగిరిపై ప్రత్యేక పూజలు

**వెదురుకుప్పం:** మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమే త కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

## భక్తిప్రపత్తులతో ఆరాధనోత్సవాలు

**పిచ్చాటూరు:** పిచ్చాటూరులో సోమవారం భక్తిప్రపత్తులతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. సంఘం గౌర వాధ్యక్షుడు జి.నాగరాజు మాట్లాడుతూ, ధనుర్మాసంలో ప్రతి ఏటా శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. ఉదయం స్థానిక మలయపెరుమాళ్ ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజల అనంతరం త్యాగరాజు, పురంధరదాసు, ముత్తుస్వామి దీక్షితుల చిత్రపటానికి ఆలయంలో పూజలు చేసి ఊరేగించారు. సాయంత్రం ఎంకేటీ కళ్యాణ మండపంలో మంగళంపాడు ఎస్.శివ, ఏ.కార్తిక్, ఎస్.ఆర్ కణ్ణన్, ఆనంద్ నాదస్వర కచేరి, పి.దశరథ, వేణుగోపాల్, గణపతి, గణేష్ డోలు కచేరి నిర్వహించారు.

# పల్లెల్లో పర్యటిస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..



సంక్షేమ పథకాల లబ్ధిని వృద్ధులకు వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టాలని విజ్ఞప్తి
- గడప గడపలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

**చంద్రగిరి:** పల్లెల్లో పర్యటిస్తూ.. కనిపించిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సాగుతున్నారు. ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతూ జనం ఆదరిస్తున్నారు. చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డిలతో కలసి సర్పంచ్ భారతీ ఆధ్వర్యంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బీసీ కాలనీలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ జాబితాలను అందజేశారు. ఆ తర్వాత ప్రతి ఇంటా లబ్ధిదారులతో మాట్లాడి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామ శివార్లలో స్థానిక ప్రజలు హర్షిత్‌రెడ్డికి హారతులు పట్టి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి ఇంటా కరోనా సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకున్నారు.

**అంతటా.. అపూర్వ స్వాగతం**

తెలుగుదేశం పార్టీకి కాస్త బలం ఉందని చెప్పుకునే గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి జనం నుంచి అపూర్వ స్వాగతం లభించింది. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి గురించి హర్షిత్‌రెడ్డి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన సోదరుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో రాజకీయ కక్షలకు అవకాశం లేకుండా అందరినీ సమానంగా చూసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి తీరుపై ఆయా గ్రామాల ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హర్షిత్‌రెడ్డి మండల అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ బాలాజీ నాయక్, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీటీసీ సులోచన, దామోదర నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు రెడ్డప్ప, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, అగరాల భాస్కర్‌రెడ్డి, చెంగల్రాయులు, నాగభూషణం, నాగేశ్వరరావు, గోపాల్ పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ఆత్మీయ పలకరింపు

- కుంట్రపాకంలో చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ ఆదరణ
- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు



కుంట్రపాకంలో చెవిరెడ్డి లక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళలు

**తిరుపతి రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను గుర్తు చేస్తూ... చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గ్రామాల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ...చెవిరెడ్డి లక్ష్మి చేపట్టిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. సోమవారం తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలో ఆమె గడప గడపకు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పంచాయతీలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కృతజ్ఞతగా పార్టీలకు అతీతంగా ప్రజలు చెవిరెడ్డి లక్ష్మికి మంగళ హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శుభపద్మానాభరెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరిముల్లవలీ, పార్టీ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, ఎంపీటీసీ రెడ్డెయ్య, మురళీ, ఖాదర్‌బాషా, రాజేంద్ర, లక్ష్మిప్రసాదరెడ్డి, రఫీ, హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 23న కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

**తిరుపతి(అలిపిరి):** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో 23న వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సోమవారం తెలిపారు. 23న వేకువజామున 12.05 నుంచి 2.30 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం ఏకాంతంగా నిర్వహిస్తారని తెలిపారు. వేకువజామున 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామి, అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై ఊరుగుతారని పేర్కొన్నారు. 24న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 4 నుంచి 5.30 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 23, 24వ తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవం సేవను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

# 21న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



హెచ్‌ఎం భాస్కర్‌కు ట్యాబులు అందజేస్తున్న ఎంఈఓలు

**రామచంద్రాపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించడానికి ట్యాబ్‌లు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. సోమవారం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికి 170 ట్యాబ్‌లు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 5 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ట్యాబులను అందజేసినట్లు తెలిపారు. వీటిని ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతిలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్యం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

**తిరుపతి తుడా:** తిరుపతి నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కు 16, స్పందనలో 17 వినతులు వచ్చాయన్నారు. కాలువలు శుభ్రం చేయాలని, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు అసంపూర్ణంగా ఉన్నాయని, మట్టి, ఇతర వ్యర్థాలను రోడ్డుపైనే వదిలేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై దృష్టి సారించాలని ఇంజినీర్లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. యూడీఎస్, మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లోపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెత్తను తడి, పొడిగా సేకరించాలని చెప్పారు. నగరంలో దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ చేపట్టాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరుకు అదనపు బస్సులు నడపండి



తిరుచానూరు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి

**తిరుపతి అర్బన్:** తిరుపతి నుంచి తిరుచానూరుకు వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి అదనపు బస్సు సర్వీసులు నడపాలని ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి మంగళం డిపో అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం తిరుపతి నుంచి తిరుచానూరుకు నడుస్తున్న పలు బస్సు సర్వీసులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు తిరుపతి నుంచి తిరుచానూరుకు రానుపోను టికెట్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం తిరుపతి డీపీటీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని 11 డిపోల నుంచి శబరిమలైకి ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయాలని చెప్పారు. బస్సుల కండిషన్‌ను పరిశీలించాలని తెలిపారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డెప్యూటీ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, మంగళం డిపో అసిస్టెంట్ డీఎం నిర్మల పాల్గొన్నారు.